కూర్చోడానికి బెంచీలు ఏర్పాటు చేయండి

అన్న క్యాంటీన్ ను పరిశీలించిన

బి.వెంకటరమణ

రాయదుర్గం,జూలై09.అక్షర టైమ్స్:- రాయదుర్గం పట్టణంలో అన్న క్యాంటీను పరిశీలించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు డా.బి. వెంకట రమణ గురువారం మధ్యానం పరిశీలించారు. ప్రధానంగా ఆహార నాణ్యత, పారిశుధ్యం, మరియు సామాజిక వివక్ష లేకుండా అందరికీ సమానంగా చూడాలని, అన్న క్యాంటీన్ లో వడ్డిస్తున్న భోజనం నాణ్యత, రుచిని ఆయన పరిశీలించారు, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఉందో లేదో అని పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలు, మరియు భోజనం చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు.సౌకర్యాల పరిశీలన: త్రాగునీరు, చేతులు కడుక్కోవడానికి అవసరమైన స్థలాలు, మరియు వృద్ధులకు/దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయో లేదో గమనించారు. అన్న క్యాంటీన్ నిర్వాహకులకు అమృతకుమార్ తో అడిగి తెలుసున్నారు . భోజనశాలలో మరియు తాగునీటి వద్ద పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ధరల పట్టిక ప్రదర్శన: ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను క్యాంటీన్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు . క్యాంటీను వచ్చే లబ్దిదారులకు త్రాగునీరు, కూర్చోవడానికి కుర్చీలు, ఫ్యాన్లు వంటి మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేసి, లోపాలుంటే సరిదిద్దాలని తెలిపారు.ఫిర్యాదుల నమోదు: క్యాంటీన్ సిబ్బంది ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించేలా చూడాలని, ఏదైనా సమస్య ఉంటే స్పందించేందుకు ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు అబ్దుల్లా, కృష్ణారెడ్డి, శంకరప్పలు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా/శ్రీ సత్యసాయి జిల్లా

అనారోగ్యంతో మృతి చెందిన ఉత్తన్న కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి అండగా వైఎస్సార్సీపీ సమన్వయకర్త బిఎస్. మక్బూల్

మానవత్వాన్ని చాటిన పార్టీ నాయకులు పరామర్శించి భరోసా

నల్లచెరువు,జూలై09.అక్షర టైమ్స్:- అనారోగ్యంతో మృతి చెందిన ఓరువాయి పంచాయతీ పల్లెవాండ్లపల్లికి చెందిన ఉత్తన్న కుటుంబానికి వైఎస్సార్సీపీ నాయకులు అండగా నిలిచారు. కదిరి వైఎస్సార్సీపీ సమన్వయకర్త బి.ఎస్. మక్బూల్, నల్లచెరువు మండల కన్వీనర్ మండెం రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మొండెం రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన ఉత్తన్న కుటుంబానికి పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న కుటుంబానికి ఈ సాయం కొంతైనా ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో వైఎస్సార్సీపీ నాయకులు ముందుంటారని తెలిపారు. కష్టసుఖాల్లో ప్రజలతోనే ఉండాలన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు బండ్రేవు నరసింహారెడ్డి, ఇసుకపల్లి వెంకట్ రెడ్డి, పల్లె వెంకట్ రెడ్డి, కుండ గంగుళ్లప్ప, రామాంజినేయులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు

ఒంటరిగా సిద్ధం: బీఎస్పీ

రాయదుర్గం,జూలై09.అక్షర టైమ్స్:- అనంతపురంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వెస్ట్ రాయలసీమ జోనల్ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఒంటరిగా పోటీ చేస్తుందని వారు అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్లు అతర్ సింగ్ రావు , సురేశ్ ఆర్య , స్టేట్ కోఆర్డినేటర్ బాలయ్య , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బండెల గౌతమ్ కుమార్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లి కార్జున, చిందనూరు నాగరాజ్ హాజరయ్యారు.అలాగే జోన్ ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, అసెంబ్లీ కమిటీ నాయకులు మరియు పార్టీ బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, కమిటీల పనితీరును సమీక్షించి, పార్టీ బలోపేతం, రానున్న ఎన్నికల సన్నద్ధతతో పాటు భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించి, నాయకులకు దిశానిర్దేశం చేశారు.

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రకృతి వ్యవసాయమే మానవ మనుగడ"





నల్లచెరువు,జూలై09.అక్షర టైమ్స్:- నల్లచెరువు మండలం, అల్లుగుండు జీపీ బొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో రైతు తిరుపాల్ రెడ్డి వద్ద 2.00 ఎకరాలలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లక్ష్మీ ప్రియ విజ్ఞప్తి చేశారు.సీడ్ ఫెలటైజేషన్ వల్ల ఉపయోగాలను యన్ ఎఫ్ ఎ దామెదరరెడ్డి తెలియజేస్తూ విత్తనాల మొలక శాతం పెరుగుతుంది మొక్కలు ప్రారంభ దశలో బలంగా ఆరోగ్యంగా ఎదుగుతాయి విత్తనాలకు అవసరమైన సూక్ష్మ పోషకాలు జీవ సూక్ష్మజీవులు అందుతాయి విత్తనాలు సమాన దూరంలో పడటంతో మొక్కల పెరుగుదల ఏకరీతిగా ఉంటుంది వర్షాభావ పరిస్థితుల్లో కూడా మొలకకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి విత్తనాలు నేలలో సులభంగా స్థిరపడతాయి పంట దిగుబడి మరియు నాణ్యత మెరుగుపడుతుంది రసాయన ఎరువుల అవసరం కొంతవరకు తగ్గుతుంది నేల ఆరోగ్యం మెరుగుపడి ప్రకృతి వ్యవసాయానికి తోడ్పడుతుంది రైతులకు సాగు ఖర్చు తగ్గి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.నినాదం సీడ్ ఫెలటైజేషన్ చేయండి ఆరోగ్యకరమైన మొలకలు అధిక దిగుబడిని పొందండి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మండల వ్యవసాయ అధికారి లక్ష్మి ప్రియ కదిరి డివిజన్ ఇన్చార్జ్ యన్ ఎఫ్ ఎ దామోదర్ రెడ్డి వీఫ్ఏ గీత ఎంపీఓ వీనిత, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

గుంతకల్ పట్టణంలో బెస్త కాలనీ లో త్రాగునీటి సమస్యను పరిష్కారం చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్,జూలై09.అక్షర టైమ్స్:-ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణంలో నందు గల ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చెరువుతో బెస్త కాలనీ లో త్రాగునీటి పరిష్కరించిన ఎమ్మెల్యే అలాగే సందర్భంగా గుంతకల్ టిడిపి ఇన్చార్జ్ నారాయణస్వామి మాట్లాడుతూ గుడ్ మార్నింగ్, కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీ స్వీకరించిన వినతి మేరకు ఆ వార్డులో నాలుగు ఇంచుల పైప్ లైన్ పనులు ప్రారంభించారు అలాగే మైనారిటీ, మార్కండేయ, మైనారిటీ కాలనీల నీటి ఇబ్బందులు పడకుండా తీర్చేందుకు కొత్త ట్యాంకు కనెక్షన్ ను పూర్తి చేసినట్లు గుంతకల్ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి తెలియజేశారు.

గుంతకల్ పట్టణంలో కుక్కల బెడద సమస్యను తీర్చిన మున్సిపాలిటీ అధికారులు

గుంతకల్,జూలై09.అక్షర టైమ్స్:- ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణం లో నందు గల మున్సిపాలిటీ అధికారులు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి ఆదేశాల మేరకు ఈరోజు ధర్మవరం గేట్ రోడ్డు మరియు భాగ్యనగర్, ఇందిరానగర్, బంగ్లా ఏరియా, హెచ్ జె పి హైస్కూల్ నందు ఏరియాలో వీధి కుక్కల ను పట్టుకున్నారు ఆ ఏరియాలో ప్రతిరోజు 5 గురునులేదా8 మందిని కరిచి వేస్తున్నాయి ఆ ఏరియా నందు పిల్లలు పెద్దలు గాని రోడ్డుపై నడవాలంటే వీధి కుక్కలు చూసి భయందోళన గురవుతున్నారని ఆ ఏరియా వారు తక్షణమే మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవికి ఫిర్యాదు చెయ్యగా కమిషనర్ లక్ష్మీదేవి స్పందిస్తూ కేవలం ఒక్కరోజు లో అక్కడున్న ఏరియా లో కుక్కల బెడద ఉండకూడదని అధికారులకు తెలియజేశారు తక్షణమే అధికారులు ఆ వీధి కుక్కలను గురువారం ఉదయం సుమారుగా 47 వీధి కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించారు. ఆ ఏరియా ప్రజలు మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవికి మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలని కోరిన విద్యుత్ శాఖ అధికారి ఏడి నాగేంద్ర

ప్రజలు బాగుంటే మనమందరం బాగుంటాం

గుంతకల్,జూలై09.అక్షర టైమ్స్:-ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణంలో నందు గల విద్యుత్ శాఖ అధికారి ఏడి నాగేంద్ర మాట్లాడుతూ గుంతకల్ పట్టణంలో పలు ప్రాంతాలలో ఏరియాలో నందు గల విద్యుత్ తీగలు పై చెట్లు కొమ్మలు విరిగి పడటం ఆ విద్యుత్ తీగలు తెగి ఊడిపోవడం, కరెంటు స్తంభాలు ఒరిగి పడిపోవడం ఇలా జరుగుతున్నాయి అందువల్ల కొన్ని ఏరియాలో చెట్లు కొమ్మలు విపరీతరంగా పెరిగి ఒక 6 రోజుల నుంచి గాలి ఎక్కువ రావడం ఆ గాలి విద్యుత్ తీగలపై తెగి ఊడిపోవడం వల్ల విద్యుత్ కరెంటు నాలుగు లేదా ఐదు గంటలు తీసి వెయ్యడం జరుగుతుంది ఈ గాలి ఎక్కువ రావడం గాలి నుంచి చెట్ల కొమ్మలు వీరికి విద్యుత్ తీగలపై పడటం జరుగుతుంది అందుకని చెట్ల కొమ్మలు నరికేయడం జరుగుతుంది విద్యుత్ తీగలు తెగి పడిపోతే ప్రజలకు ప్రాణాపాయం ఉందని ఉద్దేశంతో విద్యుత్ కరెంటు నిలిపివేయడం జరుగుతుంది అందుకని చెట్ల కొమ్మలు కొట్టేటప్పుడు ప్రజలు విద్యుత్ అధికారులను ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా చూడాలని ప్రజలను కోరిన ఏడి నాగేంద్ర ఇందుకు ప్రజలు సహకరిస్తారని కోరుతున్నాను ప్రజలు బాగుంటేనే మనమందరం బాగుంటాం అని చెప్పిన విద్యుత్ శాఖ అధికారి ఏడి నాగేంద్ర ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

యాడికి కాలువ పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి





యాడికి,జులై09.అక్షర టైమ్స్:- మండలంలోని పచ్చారు మేకలపల్లి గ్రామంలో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా పచ్చారు మేకలపల్లి గ్రామం వద్ద ఉన్న యాడికి కాలువ పూడికతీత, ముళ్ళ పొదల తొలగింపు పనులను పర్యవేక్షించి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ,మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి సీనియర్ నాయకులు రుద్రమ నాయుడు, పరిమి చరణ్ టిడిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

కల్లూరులో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

పామిడి/గార్లదిన్నె,జూలై09.అక్షర టైమ్స్:- శింగనమల నియోజకవర్గం పరిధిలో గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం ఓటర్ల సవరణ జాబితా (ఎస్ఐఆర్)ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్.ఈ సందర్భంగా కల్లూరు 13,16,17 బూతులతో పాటు కనుంపల్లి గ్రామంలోని 23 24 బూతులలోని ఓటర్ల సవరణ జాబితా నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించాలని జూలై 14 లోపు పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఓటర్లు సతమతం కావలసిన అవసరం లేదని ఓటరు యొక్క 2002 ఓట్ల జాబితా నమూనా ప్రకారం, ఓటర్ల నుంచి రెండు పాస్ ఫోటోలు, ఆధార్ జిరాక్స్ కాఫీ తీసుకొని బిఎల్ఓ ఫారంను పూర్తి చేయాలన్నారు. బిఎల్ఓకు బిఎల్ఎలు,ఓటర్లు, ఆశా వర్కర్లు, అంగనవాడి వర్కర్లు, ఆయా బూతుల ఏజెంట్లు, నాయకులు సహకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం జూలై 14 లోపల పూర్తి కావాలని లేకుంటే జూలై 21 విడుదల అయ్యే ముసాయిద్ద జాబితాలో ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మీఓటు మీహక్కు మీబాధ్యత గుర్తుంచుకోండన్నారు. ఇంకా ఐదు రోజులు కాల వ్యవధి ఉంది కావున మీ ఓటుని మీరు త్వరబడి కాపాడుకోండన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ వీరమ్మ, ఎంపీడీవో ఎం గోపాల్, వీఆర్వోలు, బిఎల్ఓలు, వీఆర్ఏలు, కార్యదర్శులు, బిఎల్ఏలు, ఓటర్లు, నాయకులు ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

పెద్దవడుగూరు,జూలై09.అక్షర టైమ్స్:- మండల కేంద్రమైన పెద్దవడుగూరు ప్రభుత్వ ఆసుపత్రి ని జిల్లా వైద్య అధికారి ఈబి దేవి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఈబీదేవి రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ఆసుపత్రి రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. అలాగే ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రత, వివిధ విభాగాలను తనిఖీ చేసి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు,సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పుష్పలత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు సురక్షితంగా ఉండాలంటే పది సూత్రాలనుపాటించండి

పామిడి,జూలై09.అక్షర టైమ్స్:- స్థానిక పామిడి పట్టణంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రామకుమార్ గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అభయ- భవిత ఫౌండేషన్ చైర్మన్ బాలచంద్ర గురూజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు సురక్షితంగా ఉండాలంటే భవిష్యత్తు ప్రణాళికలు, నియమ నిబంధన అంశాలలో భాగంగా అప్రమత్తంగా ఉండాలి, భద్రత కోసం సామాగ్రి ఉండాలి, కష్టతరములో సాయం కోరడం, అరాచక దుష్టశక్తుల నుంచి రక్షింపబడుటకు గట్టిగా అరవండి, అనుచిత స్పర్శ వద్దు, నిర్భయంగా మాట్లాడండి, నీవే ఒక అనంతశక్తివి,ప్రతిఘటించండి బాధలను పంచుకోండి సంప్రదించండి ఈ అంశాలను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాటిస్తే జీవిత భవిష్యత్తుకు ఢోకా ఉండదని విద్యార్థులకుఆయన బోధించారు. ఈ కార్యక్రమంలో బాలచంద్ర గురూజీ, ప్రధానోపాధ్యాయులు కె రామ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో పోర్టబుల్ ఎక్స్ రే మిషన్

పామిడి,జూలై09.అక్షర టైమ్స్:- స్థానిక పామిడి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనముగా టీబి ముక్త భారత్ అభియాన్ 2.0 లో భాగంగా గురువారం పోర్టబుల్ ఎక్స్రే మిషన్ తో ఐ రిస్క్ జోన్ ప్రజలకు ఎక్స్ రే పరీక్షలు నిర్వహించారు. దీనివల్ల టిబి వ్యాధిని ముందే కనుగొనేందుకు ఈ ప్రోగ్రాం ఉపయోగపడుతుందని వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మహేష్ కుమార్, శివకార్తీక్ రెడ్డి, ఎద్దులపల్లి పీహెచ్సీ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుధాకర్ మరియు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రధాన సభ్యులు చిలకల రాజగోపాల్, హెడ్ నర్స్ శివకుమారి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాశ్ నాయుడు



ముదిగుబ్బ,జులై09.అక్షర టైమ్స్:- శ్రీ సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో పలు ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాశ్ నాయుడు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో ముదిగుబ్బ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ అనేక ముఖ్యమైన రైళ్లు ప్రయాణిస్తున్నప్పటికీ స్టేషన్‌లో ఆగడం లేదని పేర్కొన్నారు. దీంతో ముదిగుబ్బతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా 12765-12766 ఎక్స్‌ప్రెస్, 16339-16340 నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్, 12769-12770 శబరి ఎక్స్‌ప్రెస్, 07191-07192 అజంతా ఎక్స్‌ప్రెస్, 12731-12732 పినాకిని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో నిలుపుదల కల్పించాలని కోరారు. ముదిగుబ్బ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన 65 వేల మందికి పైగా ప్రజలు ఈ రైల్వే స్టేషన్‌పై ఆధారపడి ప్రయాణాలు చేస్తున్నారని, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, రోగులు, వృద్ధులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పై పేర్కొన్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో హాల్ట్ మంజూరు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్‌ను సోమల ప్రకాశ్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ధర్మవరం బాల బాలికలు ఎంపిక : శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం,జులై09.అక్షర టైమ్స్:- రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే తొమ్మిదవ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్టిక్ యూత్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ధర్మవరం బాల బాలికలు ఎంపిక కావడం జరిగిందని ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శెట్టిపి విజయ చంద్రారెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జూలై 10వ తేదీ తేదీ నుండి 12 తేదీ వరకు విజయవాడ నగరంలో జరిగే 9 వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్టిక్స్ యూత్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్ల నందు బాలుర విభాగంలో ధర్మవరం పట్టణానికి చెందిన ఎం.కార్తీక్ నాయక్, బాలికల విభాగంలో యశస్విని, అలేఖ్య ధర్మవరం పట్టణానికి చెందిన 03మంది మంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఎంపిక కావడం గర్వకారణమని వారు తెలిపారు.జూన్ నెల 30వ తేదీ నెల నందు అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్స్ నందు వీరు ప్రతిభా చూపి ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ఎంపికయ్యారు అని తెలిపారు.వీరి ఎంపిక పట్ల , ధర్మాంబా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రస్థాయిలో స్థాయిలో వీరు రాణించి ధర్మవరం పట్టణమునకు పేరు ప్రతిష్టలు తేవాలని వారు ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులు గురువారం రోజున బయలుదేరి విజయవాడకి వెళ్లడం జరిగిందన్నారు.

లింగ నిర్ధరణ చట్టరీత్యానేరం..

ఆర్డీవో కార్యాలయ ఏవో.ఖతీజున్ కుప్రా

ధర్మవరం,జూలై09.అక్షర టైమ్స్:- పట్టణంలోని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరము అని ఆర్డిఓ కార్యాలయ ఏవో ఖతిజున్ కుబ్రా తెలిపారు. కలెక్టర్ , డిఎం అండ్ హెచ్ వో ఆదేశాలమేరకు సబ్ - డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైసరీ కమిటీ అండ్ పిసిపి సమావేశము ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని, వీటిని పాటించని స్కాన్ సెంటర్లపై కఠిన చేర్యలు తీసుకోబడతాయి అని తెలిపారు. ధర్మవరం పరిధిలో గల ప్రతి స్కాన్ సెంటర్స్ ను ప్రతినెలా ఆకస్మికతనిఖీ చేస్తున్నాము అని, రిపోర్ట్స్ రికార్డ్ ను పరిశీలించడం జరుగుతుంది అని తెలిపారు.ఎవరైనా నిబంధనలు ఉల్లగించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ డిపార్ట్మెంట్ నుండి ఎల్లవేళలా సహకారం ఉంటుందని పోలీస్ శాఖ వారు తెలిపారు. ఈ కార్యక్రమశీలో వైద్యులు జయలక్ష్మి, డీజీవో డాక్టర్ శ్వేత, జయంత్, డి ఈ ఎం ఓ కార్యాలయం నుండి రామలక్ష్మి గారు, డిప్యూటీ హెచ్ఈఓ విజయ్ కుమార్, గారు, డి.ఎస్.పి ఆఫీస్ నుండి జాకీర్ హుస్సేన్ , రోటరీ క్లబ్ - నరేంద్ర రెడ్డి , అన్నమయ సేవాసమితి - పుల్లయ్య , కమ్యూనిటీ ఆర్గనైసార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పట్టణ బిజెపి అధ్యక్షులు జింకా చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

ధర్మవరం,జులై09.అక్షర టైమ్స్:- పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఓబీసీమోర్చా పట్టణ అధ్యక్షులు మహేష్ ప్రజాపతి, ఓ బి సికమిటీ ఆధ్వర్యంలో పట్టణ బిజెపి అధ్యక్షులు జింకా చంద్రశేఖర్ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి చంద్రశేఖర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జింక చంద్రశేఖర్ సేవలను కొనియాడారు. బిజెపి పార్టీ బలోపేతానికి వారు చేస్తున్న కృషి అభినందినీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో గాడ్డపర్తి మధు బాబు గారు - జిల్లా ఉపాధ్యక్షులు,మధు- ఓబీసీపట్టణ ఉపాధ్యక్షులు,కురబ సుబ్రమణ్యం,బాలకర్ణ, బండ్లపల్లి రాజు - ప్రధాన కార్యదర్శి,ఉట్టి ప్రసాద్- కార్యదర్శి,దేవరకొండ మురళి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమాజంలో అశాంతిని సృష్టించే వారిని తరిమి కొట్టాలి : ఎమ్మెల్యే కాలవ



రాయదుర్గం,జూలై09.అక్షర టైమ్స్:- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ సమాజంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించే వారిని ప్రజలే తరిమి కొట్టాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గుమ్మగట్ట మండలం బేలోదు గ్రామంలో గురువారం నిర్వహించిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నప్పటికీ, వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే కుట్రపూరిత శక్తులకు వారు అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి తో పాటు ఆపార్టీ నాయకులు పదేపదే అధికార పార్టీ నేతలపై బురద చల్లుతూ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు హిందూ దేవతలు, సంప్రదాయాలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘవిద్రోహ శక్తులకు వత్తాసు పలికే ఇలాంటి నేతలకు తగిన బుద్ధి చెప్పకపోతే మళ్లీ మళ్లీ నిరాధారమైన ఆరోపణలను చేస్తూనే ఉంటారని తెలియజేశారు. అధికారంలో ఉన్న తాము ఏదైనా చేస్తే... అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేశారని అబాండాలు వేస్తారన్నారు. అదే ప్రజలు ఒకసారి తిరగబడితే మళ్లీ మన జోలికి రారని సూచించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసే వారికి మీరే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులే కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద బలమని, ప్రజల మద్దతు ఉన్నంతకాలం రాష్ట్ర అభివృద్ధిని ఏ శక్తి అడ్డుకోలేదని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రైతుల హక్కులను హరించే విధంగా వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే చీకటి చట్టాన్ని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందన్నారు. భూ యజమానికి తన సొంత పొలంపై సర్వ హక్కులు కల్పిస్తూ మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతుల ఫొటోతో పాటు రాజముద్ర కలిగిన ఈ పాస్‌పుస్తకాలు భూ యాజమాన్యానికి మరింత భరోసా కల్పిస్తాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాలువ సన్నన్న, యూనిట్ ఇంఛార్జి బేలోదు సంజీవ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ధానవేంద్ర, కెపి దొడ్డి నాగరాజు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కురుబ గిరిమల్లప్ప, తాళ్లకేర వెంకటేశులు, మాజీ సర్పంచ్ నాగరాజు, సత్యనారాయణ,కాలువ నాగరాజు,రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించిన ముదిగుబ్బ పోలీసులు

ముదిగుబ్బ,జులై09.అక్షర టైమ్స్:- శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం కస్తూరిబా పాఠశాల లో మహిళలు, బాలికల భద్రత, చట్టాలపై అవగాహన, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, సామాజిక బాధ్యతలపై విద్యార్థినులకు ముదిగుబ్బ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళల రక్షణకు అమలులో ఉన్న చట్టాలు, బాలికల భద్రతకు సంబంధించిన పోక్సో చట్టం, గృహ హింస, కట్న వేధింపులు, లైంగిక వేధింపులపై ఉన్న చట్టపరమైన హక్కుల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠశాలకు వెళ్లే సమయంలో, ఇంటికి తిరిగి వచ్చే సమయంలో అపరిచితులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, బ్యాంకు వివరాలు, ఓటీపీ లు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ ఇవ్వవద్దని సూచించారు. ఎవరైనా వేధించినా, బెదిరించినా లేదా అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రతి బాలిక తన విద్యను పూర్తి చేసి స్వయం సమర్థురాలిగా ఎదగాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో తెలియని లింకులను ఓపెన్ చేయకుండా, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతపై కూడా విద్యార్థులకు సూచనలు చేస్తూ, 18 సంవత్సరాల లోపు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112 పోలీస్ అత్యవసర సేవ, 181 మహిళల హెల్ప్‌లైన్, 1098 చిన్నారుల హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు. ముదిగుబ్బ పోలీసులు ప్రజల భద్రతకు, మహిళల రక్షణకు, విద్యార్థుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు

ధర్మవరంలో ఘనంగా ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

78 ఏళ్లుగా విద్యార్థి సమాజానికి మార్గదర్శిగా నిలిచిన ఏబీవీపీ

విద్యార్థి శక్తిని జాతి నిర్మాణ దిశగా నడిపిస్తున్న గొప్ప విద్యార్థి ఉద్యమం ఏబీవీపీ

దేశభక్తి, సేవాభావానికి ప్రతీకగా ఏబీవీపీ

భారతీయతను యువతలో నింపుతున్న మహత్తర విద్యార్థి ఉద్యమం ఏబీవీపీ

విద్యార్థి శక్తే దేశ భవిష్యత్తు -ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవంలో హరీష్ బాబు

ధర్మవరం,జూలై09.అక్షర టైమ్స్:- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ధర్మవరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కాలేజ్ సర్కిల్ నుంచి గాంధీనగర్ వరకు భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించగా, వందలాది మంది విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు, విద్యాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పూర్వ రాష్ట్ర ఏబీవీపీ విద్యార్థి నాయకులు, మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. హరీష్ బాబు మాట్లాడుతూ..1949 జూలై 9న ప్రారంభమైన ఏబీవీపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగి, దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం అనే ఉన్నత విలువలతో కోట్లాది మంది విద్యార్థులను తీర్చిదిద్దుతోందని అన్నారు. విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా సమాజ సేవ, జాతీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించుకోవడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారంతో పాటు విద్యా వ్యవస్థ బలోపేతానికి, దేశ అభివృద్ధికి అవసరమైన సృజనాత్మక ఆలోచనలను ముందుకు తీసుకువస్తూ నిరంతరం ఉద్యమిస్తోందని తెలిపారు. విద్య -- వ్యక్తిత్వ వికాసం -- సేవ అనే సిద్ధాంతంతో పనిచేస్తున్న ఏబీవీపీ, దేశ నిర్మాణంలో యువత పాత్రను మరింత బలోపేతం చేస్తోందని హరీష్ బాబు అన్నారు. భారతీయ సంస్కృతి, జాతీయత, సామాజిక బాధ్యతలను యువతలో పెంపొందిస్తూ భావి భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేస్తున్న సంస్థగా ఏబీవీపీ నిలిచిందని కొనియాడారు. అనంతరం ఏబీవీపీ జెండాకు వందనం చేసి, సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా పాల్గొని ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఏబీవీపీ నాయకులు బిల్లే రవి, మురళి గౌడ్, శంకర చంద్ర, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గిరి వాల్మీకి, నగర కార్యదర్శి శివ, బిజెపి మండల అధ్యక్షులు గొట్లూరు చంద్ర, ప్రకాష్ గౌడ్, జూటూరు వెంకటేష్, నారా కొండయ్య చౌదరి, ఏబీవీపీ నాయకులు విష్ణు చరణ్, విశ్వనాథ్, సంతోష్, హితేష్, సాయి, విద్యార్థులు, కార్యకర్తలు, అధ్యాపకులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సైన్స్ చదవడానికి ఉపయోగపడే మెటీరియల్..బయాలజీ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు వెల్లడి

ధర్మవరం,జులై09.అక్షర టైమ్స్:- పట్టణంలోని శివానగర్లో గల మున్సిపల్ ఉన్నత పాఠశాల లోని సైన్స్ చదవడానికి ఉపయోగపడే మెటీరియల్ను బయాలజీ టీచర్ రవిశేఖర్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు గోవర్ధన్ తయారు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ లు రాజేశ్వరి దేవి గోపాల్ నాయక్ ఆ మెటీరియల్ను వారి చేతులు మీదుగా విడుదల విడుదల చేశారు.ఎంఈఓ లుమాట్లాడుతూ ఉపాధ్యాయులు రవి శేఖర్,గోవర్ధన్ చేపట్టిన ఈ మెటీరియల్ సైన్సు సులభరీతిలో చదవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దీని ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల ఉన్నటువంటి భయాన్ని తొలగించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడంతోపాటు పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు రావడానికి ఇది ఒక రకంగా ఉపయోగపడుతుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శివనగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులకు దిశ, నిర్దేశం చేశారు. అనంతరం ఎంఈఓ లు మాట్లాడుతూ ఈ మెటీరియల్ పద్ధతిని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అవగాహన కల్పించి వచ్చే సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. తదుపరి ఎంఈఓ లు ఆ ఇరువురి టీచర్లను అభినందించారు.

జార్దార్ తో ముగిసిన వీర్ల పండగ

ఇమామ్ కాసిం స్వామికి జల్దార్ తో ముగింపు

పామిడి,జూలై09.అక్షర టైమ్స్:- స్థానిక పామిడి పట్టణంలోని షాధికాణా ప్రక్కన గల ప్రఖ్యాతి చెందిన ఇమామ్ ఖాసిం స్వామికి గురువారం జాల్దార్ కార్యక్రమంతో ముగిసిన వీర్ల పండుగ వేడుకలు. ఇమామ్ కాసిం మసీద్ వ్యవస్థాపక అధ్యక్షుడు బెస్త ఓబులపతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బెస్త వీధిలోని భక్తాలు స్వాములను తిరిగి ఏడాది పాటు చూడలేము అని చివరి దర్శనం భక్తులకు కల్పించి స్వాములందరినీ పెట్టెలో భద్రంగా బంధించారు. స్వామికి వచ్చిన ముడుపులు వస్తువులు నగలు వ్యవస్థాపకుడు బెస్త ఓబులపతి ఇంటికి చేర్చారు. ఈ కార్యక్రమంలో ఓబులపతి,ముల్లా సావ్ మహమ్మద్ భాష (ముత్తువలి)తోపాటు సురేష్, బెస్త సుబ్రహ్మణ్యం, పెన్నోబులెస్, సునీల్ అజయ్ విష్ణు తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

20 ఏళ్ల హోమ్ లోన్ 13 ఏళ్లల్లోనే తీర్చవచ్చు

ఈ చిన్న టిప్స్ పాటిస్తే మీపై ఆర్థిక భారం తగ్గినట్లే..

ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సొంతిల్లు నిర్మించుకునేందుకు చాలామంది బ్యాంకుల నుంచి హోమ్ లోన్ తీసుకుంటున్నారు. ఇటీవల ఎన్ఎఫ్‌బీసీ సంస్థలు కూడా హోమ్ లోన్ జారీ చేస్తున్నాయి. అయితే హోమ్ లోన్ 13 ఏళ్లల్లోనే తీర్చడం వల్ల మీకు వడ్డీ ఆదా అవుతుంది. సొంతిల్లు నిర్మించుకోవాలనేది ప్రతీఒక్కరి జీవితకాలపు కల. తమ కలను నిజం చేసుకునేందుకు తాము కష్టించి సంపాదించిన సొమ్మును కూడబెట్టుకుంటూ ఉంటారు. అయితే ముడి సరుకు ధరలన్నీ పెరిగిన క్రమంలో ఇప్పట్లో ఇల్లు నిర్మించడం పెద్ద భారంగా మారింది. సొంతింటి కోసం రూ.లక్షల ఖర్చు అవుతుంది. సామాన్యుడి దగ్గర అంత డబ్బులు ఉండవు. దీంతో బ్యాంక్ నుంచి హోమ్ లోన్ తీసుకుంటూ ఉంటారు. గృహ రుణం కాలపరిమితి 20 ఏళ్ల వరకు ఉంటుంది. అయితే 20 ఏళ్ల పాటు ఈఎంఐ చెల్లించుకుంటూ ఉంటే వడ్డీ ఎక్కువ అవ్వడంతో పాటు ఆర్థిక భారం ఎక్కువగా ఉంటుంది. అయితే కొన్ని చిట్కాలు పాటించడం వల్ల 13 నుంచి 14 ఏళ్లల్లో హోమ్ లోన్ తిరిగి చెల్లించవచ్చు. అదెలా అనేది ఇప్పుడు చూద్దాం.

ఈ మూడు మార్గాలు

ఉదాహరణకు మీరు 20 ఏళ్లల్లో చెల్లించడానికి 8.5 శాతం వడ్డీతో రూ.40 లక్షల హోమ్ లోన్ తీసుకున్నారనుకుందాం. మీకు నెలకు ఈఎంఐ రూ.34,678 పడుతుంది. మీరు 20 ఏళ్ల పాటు చెల్లిస్తూ ఉంటే రూ.83 లక్షలు కూడబెడతారు. అదే మీరు 13 సంవత్సరాల్లో తిరిగి చెల్లించాలంటే ఈఎంఐను పెంచుకోవాల్సి ఉంటుంది. ఈఎంఐ రూ.44,200కి పెంచుకుంటే 13 ఏళ్లకు రూ.68,95,200 అవుతుంది. ఈ విధానంలో మీకు రూ.14,27,520 వడ్డీ ఆదా అవుతుంది. ఇక ఇదే కాకుండా ప్రతీ ఏడాది ముందుగా చెల్లించే పద్ధతి మరోకొటి ఉంది. ఈఎంఐ రూ.34,678 ఉండగా.. సంవత్సరానికి రూ.2 లక్షలు ముందే చెల్లించండి. దీని వల్ల కాలపరిమితి 13 సంవత్సరాలకు తగ్గుతుంది. ముందుగా చెల్లించడం వల్ల ఈఎంఐల సంఖ్య తగ్గుతుంది. దీని వల్ల రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు వడ్డీ ఆదా అవుతుంది. ఇక ఈఎంఐ చెల్లింపులు, ముందస్తు చెల్లింపులు రెండూ ఎంచుకోవడం వల్ల కూడా లాభం జరుగుతుంది. దీని వల్ల రూ.13 నుంచి రూ.14 లక్షల వరకు మీకు ప్రయోజనం ఉంటుంది.

ఈఎంఐ తగ్గించుకోవడం ఎలా..?

అలాగే మీరు ఫ్లోటింగ్ వడ్డీ రేటు ఎంచుకుంటే ఆర్బీఐ వడ్డీ రేటు తగ్గించినప్పుడలా మీకు ఈఎంఐ తగ్గుతుంది. దీంతో బ్యాంక్‌కు వెళ్లి ఈఎంఐ తగ్గించమని అడగండి. దీంతో బ్యాంకులు వడ్డీ రేటు తగ్గించడం వల్ల మీకు ప్రయోజనం ఉంటుంది. ఇక ఏదైనా బ్యాంకులు వడ్డీ రేటు తక్కువగా ఉంటే.. ఈ బ్యాంక్ నుంచి ఆ బ్యాంక్‌కు మీ లోన్‌ను బదిలీ చేసుకోండి. దీన వల్ల కూడా మీకు లాభం ఉంటుంది.

బంగారం నల్లగా మారితే అది నకిలీదేనా..?

కొనేముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

ప్రస్తుతం బంగారం ధర తగ్గడంతో అమ్మకాలు మళ్లీ పుంజుకున్నాయి. ఇటీవల అక్షయ తృతీయ రావడంతో గోల్డ్ విక్రయాలు పెరిగాయి. అయితే గోల్డ్‌ను కొన్ని రోజులు వాడిన తర్వాత నల్లగా మారుతాయా.. నల్లగా మారితే నకిలీ గోల్డ్ అని అర్థమా.. అనే విషయాలు చూద్దాం. ప్రస్తుతం బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో తులం బంగారం రూ.1.80 లక్షల జీవితకాలపు గరిష్ట స్థాయికి చేరుకోగా.. ఆ తర్వాత నుంచి క్రాష్ అవుతూ వస్తోంది. ప్రస్తుతం రూ.1.50 లక్షల వద్ద ఊగిసలాడుతున్నాయి. అయితే ఇండియాలో గోల్డ్ అంటేనే ప్రజలకు సెంటిమెంట్. పంక్షన్లు, పండుగలు ఏదైనా మెడలో బంగారం ఉండాల్సిందే. ధరలు పెరిగిన క్రమంలో బంగారం కొనుగోలు చేసేందుకు చాలామంది వెనకడుగు వేస్తున్నారు. ఇలాంటి సమయాల్లో కొన్నిచోట్ల మోసాలు కూడా జరుగుతున్నాయి. నకిలీ లేదా నాసిరకం బంగారాన్ని విక్రయించడం లాంటివి చోటుచేసుకుంటున్నాయి. కొన్నిసార్లు ధరించిన బంగారం నల్లబడుతుందని చాలామంది చెబుతుంటారు. అసలు బంగారం నిజంగానే నల్లబడుతుందా..? దీనికి రీజన్ ఏంటి..? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

నల్లగా అయితే నకిలీదా..?

మీరు ధరించిన బంగారం నల్లగా మారిందని ఆందోళన పడుతున్నారా..? నకిలీ బంగారం అనుకుని అయోమయానికి గురవుతున్నారా..? అయితే గోల్డ్ కొంతకాలం తర్వాత నల్లబడుతుందని పరీక్షల్లో తేలింది. 24 క్యారెట్ల బంగారం నల్లబడదు. అయితే అది మృదువుగా ఉండటం వల్ల ధరించలేము. దీంతో ఆభరణాలు తయారుచేసే సమయంలో వాటిల్లో రాగి, వెండి, జింక్ లాంటివి కలుపుతారు. ఈ లోహాలు గాలిలోని ఆక్సిజన్, తేమ, చెమటకు ప్రభావితం అవుతాయి. దీని వల్ల ఆక్సీకరణం జరిగి ఆభరణం ఉపరితలంపై నల్లటి పొర ఏర్పడుతుంది.

కారణాలు ఏంటంటే..?

చెమటలోని అధిక అమ్లత్వం గోల్డ్‌తో కలవడం వల్ల చర్య జరుగుతుంది. దీని వల్ల ఆభరణాలు నల్లగా మారుతాయి. ఇక గాలి కాలుష్యం, అధిక సల్ఫర్ బంగారాన్ని నల్లగా మారుస్తుంది. ఇక దుమ్ము, ధూళి, సబ్బు మలినాలు వంటివి కాలక్రమేణా బంగారాన్ని నల్లగా మారుస్తాయి. ఇక పెర్ఫ్యూమ్స్, లోషన్లు, మేకప్, హెయిర్ స్ప్రేలోని రసాయనాలు గోల్డ్‌ను నల్లగా మారుస్తాయి. మీరు ఇంట్లోనే ఉండి నల్లగా అయిన బంగారాన్ని మెరిసేలా చేసుకోవచ్చు. గోరువెచ్చని నీటిలో కొద్దిగా డిష్ సెప్ కలపండి. అందులో ఆభరణాన్ని 20 నిమిషాల పాటు నానబెట్టండి. ఆ తర్వాత మెత్తని టూత్ బ్రష్‌తో మెల్లగా రుద్దండి. దీని వల్ల నలుపు పోతుంది. ఇక బేకింగ్ సోడా, నీటితో చేసిన పేస్ట్ రుద్దడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. ఇక మీరు నకిలీ బంగారాన్ని ఎలా గుర్తించాలంటే.. నిజమైన బంగారం బరువు వల్ల నీటిలో వేస్తే వెంటనే మునిగిపోతుంది. అదే ఇతర లోహాలు కలిపిన బంగారం తేలియాడుతూ ఉంటుంది. ఇక నిజమైన బంగారం అయస్కాంతానికి ఆకర్షించబడదు. అదే ఆయస్కాంతానికి అతుక్కుపోతుంటే బంగారంలో ఇతర లోహాలు కలిపినట్లు అర్థం చేసుకోవచ్చు.

పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి భారీ గుడ్ న్యూస్ ఇంటి వద్ద నుంచే యాక్టివేట్ చేసుకోవచ్చు ఎలా అంటే..?



పీఎఫ్ అకౌంట్ సేవల్లో వేగం పెరగనుంది. ఇప్పటివరకు పాత పీఎఫ్ అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడం, యాక్టివేట్ చేసుకోవడానికి కిష్టతరమైన ప్రక్రియ ఉండేది. కానీ ఇప్పటినుంచి ఆన్‌లైన్ ద్వారా సులువుగా కనిపెట్టడంతో పాటు యాక్టివ్ చేసుకోవచ్చు. అనంతరం సులువుగా డబ్బులు విత్ డ్రా చేసుకోవచ్చు. మీరు పీఎఫ్ అకౌంట్‌ను మూడేళ్ల పాటు వాడకపోతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఇనాక్టివ్ చేస్తుంది. మూడేళ్ల పాటు మీ అకౌంట్‌లో ఎలాంటి కాంట్రిబ్యూషన్ జమ కాకపోయినా, క్లెయిమ్స్ కోసం రిక్వెస్ట్‌లు పెట్టకపోయినా అకౌంట్ ఇనాక్టివ్ అవుతుంది. ఇలాంటి సమయంలో మీ అకౌంట్లోని డబ్బు తీసుకోవాలన్నా సాధ్యం పడదు. తిరిగి అకౌంట్‌ను యాక్టివ్ చేసుకుంటేనే డబ్బులు తిరిగి తీసుకోవచ్చు. మీరు ఇక నుంచి ఇంటి వద్దనే మొబైల్ ద్వారా అకౌంట్‌ను తిరిగి యాక్టివ్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఇ-ప్రాప్తి అనే పోర్టల్‌ను కేంద్రం తీసుకొస్తుంది. త్వరలోనే దీనిని తీసుకురానున్నట్లు ఇటీవల కేంద్ర ఉపాధి, కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. పాత అకౌంట్లలో నిలిచిపోయిన డబ్బులను తిరిగి పొందటంలో ఇబ్బందులు పడుతున్న లక్షలాదిమంది ఖాతాదారులకు ఇది ఉపశమనం కలిగించే విషయమని చెప్పవచ్చు.

ఇంటి వద్ద నుంచే యాక్టివేట్

ఆధార్ ద్వారా ఖాతాదారులు పాత పీఎఫ్ అకౌంట్లను గుర్తించవచ్చు. అలాగే వాటిల్లో ఉన్న నగదును విత్ డ్రా చేసుకోవచ్చు. ఇంటి వద్ద నుంచే అకౌంట్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు పాత పీఎఫ్ అకౌంట్లను యాక్టివేట్ చేసుకోవాలన్నా లేదా అమౌంట్ క్లెయిమ్ చేసుకోవాలన్నా పాత యజమాని నుంచి ఆమోదం పొందాల్సి వచ్చేది. అలాగే పేపర్ వర్క్ కూడా చాలా ఉండేది. పాత కంపెనీలు మూతపడటం, మద్దతు ఇవ్వడంలో నిరాకరించడం వల్ల ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇప్పుడు కొత్తగా రానున్న ఇ-ప్రాప్తి వెబ్‌సైట్ యాజమాన్యాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ఉద్యోగులు తమ ఆధార్ ఉపయోగించి నేరుగా పాత పీఎఫ్ అకౌంట్లను యాక్టివేట్ చేసుకోవచ్చు.

హోర్ముజ్ వ్యూహాన్ని ఛేదించిన తొలి నౌక 'సర్వశక్తి'

సంక్షోభ జలాల్లో భారత్ సాహసోపేత ప్రయాణం!

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇంధన భద్రత విషయంలో భారతదేశం ఒక కీలక విజయాన్ని అందుకుంది. అమెరికా ఆంక్షలు, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న హోర్ముజ్ జలసంధిని భారత ఎల్‌పీజీ ట్యాంకర్ 'సర్వశక్తి' విజయవంతంగా దాటింది. దాదాపుగా నౌకల రాకపోకలు నిలిచిపోయిన ఈ ప్రమాదకర మార్గంలో, 45,000 టన్నుల గ్యాస్‌తో ఈ నౌక ప్రయాణించడం దేశీయ ఇంధన సంక్షోభానికి ఒక ఆశాకిరణంగా మారింది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇంధన భద్రత విషయంలో భారతదేశం ఒక కీలక విజయాన్ని అందుకుంది. అమెరికా ఆంక్షలు, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న హోర్ముజ్ జలసంధిని భారత ఎల్‌పీజీ ట్యాంకర్ 'సర్వశక్తి' విజయవంతంగా దాటింది. దాదాపుగా నౌకల రాకపోకలు నిలిచిపోయిన ఈ ప్రమాదకర మార్గంలో, 45,000 టన్నుల గ్యాస్‌తో ఈ నౌక ప్రయాణించడం దేశీయ ఇంధన సంక్షోభానికి ఒక ఆశాకిరణంగా మారింది. మార్షల్ దీవుల జెండాతో పయనిస్తున్న 'సర్వశక్తి', ఇరాన్‌లోని లారాక్, ఖేష్మ్ దీవులకు సమీపంగా ప్రయాణించింది. ఇరాన్ నిర్దేశించిన ప్రత్యేక మార్గాన్ని అనుసరిస్తూ శనివారం (మే 02) ఒమన్ గల్ఫ్‌లోకి ప్రవేశించింది. ఈ నౌకలో 18 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో, తమ నౌకల్లో భారతీయులు ఉన్నారనే సమాచారాన్ని బహిరంగంగా ప్రసారం చేయడం ఇప్పుడు ఒక తప్పనిసరి భద్రతా చర్యగా మారింది. ఫిబ్రవరిలో పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించిన ఈ నౌక, దుబాయ్ సమీపంలో 'షిప్-టు-షిప్' పద్ధతిలో సరుకును సేకరించింది. అయితే, ఎలక్ట్రానిక్ అంతరాయాల కారణంగా ఓడ ఖచ్చితమైన ఉనికిని గుర్తించడం సవాలుగా మారింది. ఇదిలావుంటే, ప్రస్తుతం భారత్ తీవ్రమైన ఎల్‌పీజీ కొరతను ఎదుర్కొంటోంది. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఎల్‌పీజీ వినియోగదారుగా ఉన్న భారత్‌లో, మధ్యప్రాచ్యం నుండి సరఫరా నిలిచిపోవడంతో గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదారులు బారులు తీరుతున్నారు. దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని రోజుకు 54,000 టన్నులకు పెంచినప్పటికీ, వినియోగం 80,000 టన్నులుగా ఉంది. ఈ లోటును పూడ్చేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ సంస్థలు సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నాయి. 'సర్వశక్తి' మోసుకొస్తున్న సరుకు విశాఖపట్నం టెర్మినల్‌కు చేరడమే లక్ష్యంగా పెట్టుకుంది. హోర్ముజ్ జలసంధిలో గతంలో 'దేశ్ గరిమ' వంటి నౌకలు ట్రాన్స్‌పాండర్లను ఆపివేసి తృటిలో ప్రమాదాల నుండి తప్పించుకున్నాయి. ఏప్రిల్‌లో పరిస్థితి మరింత విషమించి, నౌకలపై కాల్పులు జరిగిన తరుణంలో భారత్ తన దౌత్య మార్గాలను ఉపయోగించింది. టెహ్రాన్‌తో జరిపిన చర్చల ఫలితంగా ఇప్పటికే ఎనిమిది నౌకలను దారి మళ్లించడంలో భారత్ సఫలమైంది. అమెరికా దిగ్బంధనం తర్వాత ఈ మార్గం గుండా ప్రయాణించిన తొలి ట్యాంకర్‌గా 'సర్వశక్తి' నిలిచింది. ఇది కేవలం ఒక నౌక ప్రయాణం మాత్రమే కాదు, అంతర్జాతీయ సంక్షోభాల మధ్య తన ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో భారతదేశం ప్రదర్శిస్తున్న పట్టుదలకు, దౌత్య చాకచక్యానికి నిదర్శనం. విశాఖ తీరానికి ఈ నౌక చేరడం కోట్లాది భారతీయ కుటుంబాల వంటగదులకు భరోసానివ్వనుంది.

రైలు ఆలస్యమైనందుకు ప్రయాణికుడికి రూ.1.25 లక్షలు చెల్లించిన రైల్వే.. అసలేమైందంటే..!

ఫోరం ఆదేశించిన విధంగా 30 రోజులలోగా రైల్వేలు ఉత్తర్వును అమలు చేయడంలో విఫలమవడంతో మొత్తం బాధ్యత గణనీయంగా పెరిగింది. ఉత్తర్వును పాటించని ప్రతి రోజుకు రూ.500 అదనపు జరిమానా చెల్లించాలని కూడా ఫోరం రైల్వేలను ఆదేశించింది. ఈ నివేదిక ప్రకారం.. రైలు టిక్కెట్టు బుక్ చేసుకున్న వ్యక్తికి తమ గమ్యస్థానానికి సమయానికి చేరుకునే హక్కు ఉంటుంది. అయితే, రైలు గంటల తరబడి ఆలస్యంగా వచ్చి, ఆ జాప్యం కారణంగా ప్రయాణికుడు నష్టపోతే, రైల్వేలు వారికి నష్టపరిహారం చెల్లించాలి. ఒడిశాలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (బలంగీర్) ఇదే విధమైన తీర్పును జారీ చేసింది.

అసలేమైంది..?

హెచ్‌టిలోని ఒక నివేదిక ప్రకారం, ఈ కేసు బోలంగీర్ జిల్లా నివాసి అయిన చండీ ప్రసాద్ ఖమారికి సంబంధించినది. అతను 2024 ఆగస్టు 23న ఝార్సుగూడ నుండి ఒడిశాలోని హౌరాకు వెళ్లే 12129 నంబర్ రైలులో టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. ఆ రైలు ఝార్సుగూడ నుండి రాత్రి 7:50 గంటలకు బయలుదేరి, హౌరాకు తెల్లవారుజామున 3:55 గంటలకు చేరుకుంటుంది. ఈ షెడ్యూల్ ఆధారంగా అతను కోల్‌కతా విమానాశ్రయం నుండి గౌహతికి ఉదయం 8:05 గంటలకు బయలుదేరే విమాన టిక్కెట్‌ను బుక్ చేసుకున్నాడు. అంటే అతనికి నాలుగు గంటలకు పైగా అదనపు సమయం ఉంది.

రైలు ఆలస్యంగా వచ్చింది:

ప్రయాణం చేయాల్సిన రోజున రైలు ఝార్సుగూడ నుండి రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. ఉదయానికి అది హౌరా చేరుకునేసరికి ఏడు గంటలు ఆలస్యమైంది. ఇలాంటి పరిస్థితిలో అతను విమానాన్ని మిస్ అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఖమారి గౌహతికి వెళ్లే మరో విమానంలో టిక్కెట్టు బుక్ చేసుకున్నాడు. కానీ అది చాలా ఖరీదైనదిగా తేలింది. ఇక మానసిక వేదన అనేది వేరే విషయం. దీని తర్వాత, నష్టానికి పరిహారం చెల్లించమని కోరుతూ అతను రైల్వేకు లేఖలు రాశాడు . అనేకసార్లు లేఖలు రాసినప్పటికీ రైల్వే అతనికి నష్టపరిహారం చెల్లించలేదు. దీంతో అతను నిరాశ చెంది వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించాడు.

రైల్వే ఏం చెబుతోంది?

వినియోగదారుల ఫోరమ్‌లో రైల్వే అధికారులు, ఇండియన్ రైల్వే కాన్ఫరెన్స్ అసోసియేషన్ కోచింగ్ టారిఫ్ నిబంధనల ప్రకారం రైలు సమయపాలనకు హామీ లేదని, కార్యాచరణ కారణాల వల్ల రైళ్లు ఆలస్యం కావచ్చని వాదించారు. ప్రయాణంలోని కొన్ని భాగాలు తమ అధికార పరిధిలోకి రావని కూడా వారు పేర్కొన్నారు. రైల్వే వాదనలను జిల్లా వినియోగదారుల ఫోరమ్ తిరస్కరించింది. రైల్వే ఒక ఏకీకృత ప్రజా వినియోగ సేవ కాబట్టి, దాని కార్యకలాపాల ప్రాంతం వల్ల కలిగే రైలు ఆలస్యాలకు ఆ ఆలస్యం తమ నియంత్రణకు మించినదని నిరూపించనంత వరకు రైల్వేనే బాధ్యత వహించాలని ఫోరం పేర్కొంది. నార్త్ వెస్ట్రన్ రైల్వే, ఇతరులు వర్సెస్ సంజయ్ శుక్లా కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకిస్తూ, బాధ్యత నుండి తప్పించుకోవాలంటే రైల్వే అధికారులు ఆ ఆలస్యం అనివార్యమని, తమ నియంత్రణకు మించినదని నిరూపించాల్సి ఉంటుందని ఫోరం పేర్కొంది. ఆ ఆలస్యం అసాధారణ పరిస్థితుల కారణంగా జరిగిందని నిరూపించడానికి రైల్వే ఎటువంటి ఆధారాలు చూపలేదని వినియోగదారుల ఫోరం తెలిపింది.

అది తన తీర్పును ఇచ్చింది

ఈ కేసులో "రైలు సర్వీసులో విపరీతమైన ఆలస్యం కారణంగా ఫిర్యాదుదారుడు తన విమానాన్ని కోల్పోయి, అపారమైన నష్టాన్ని, మానసిక వేదనను అనుభవించాడు" అని ఫోరం పేర్కొంది. ఈ ఆలస్యం పరిణామాలకు రైల్వేలు ఉమ్మడిగా, విడివిడిగా బాధ్యత వహించాలని ఫోరం తెలిపింది. విమానం కోల్పోవడం, తిరిగి బుకింగ్ చేసుకోవడం వల్ల కలిగిన నష్టానికి రూ. 20,000, మానసిక వేదన, వేధింపులకు రూ.30,000, వ్యాజ్యపు ఖర్చులను భరించడానికి రూ. 5,000 చెల్లించాలని ఫోరం రైల్వేలను ఆదేశించింది. ఫోరం ఆదేశించిన విధంగా 30 రోజులలోగా రైల్వేలు ఉత్తర్వును అమలు చేయడంలో విఫలమవడంతో మొత్తం బాధ్యత గణనీయంగా పెరిగింది. ఉత్తర్వును పాటించని ప్రతి రోజుకు రూ.500 అదనపు జరిమానా చెల్లించాలని కూడా ఫోరం రైల్వేలను ఆదేశించింది. ఈ నివేదిక ప్రకారం, 200 రోజులకు పైగా ఉత్తర్వు అమలు కాకపోవడంతో సుమారు రూ.1.3 లక్షల జరిమానా పేరుకుపోయింది. ప్రయాణికుడు ఏప్రిల్ 19న సదరు మొత్తాన్ని అందుకున్నాడు.

వామ్మో వచ్చే 5 ఏళ్లలో బంగారం ధర అంత పెరుగుతుందా ఈ లెక్కలు చూస్తే మైండ్ బ్లాంకే..

బంగారం అంటే భారతీయులకు ఆదుకునే నిజమైన నేస్తం. ప్రస్తుతం బంగారం ధరలు కొంత తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకుంటున్న సామాన్యులకు.. డాయిష్ బ్యాంక్ షాకింగ్ నివేదిక ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వచ్చే ఐదేళ్లలో బంగారం ధర ఏకంగా 80 శాతం పెరగబోతోందన్న అంచనాలు గుబులు రేపుతున్నాయి. ఆ వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.. బంగారం.. భారతీయులకు కేవలం ఒక ఆభరణం మాత్రమే కాదు, ఒక సురక్షితమైన పెట్టుబడి. గత కొన్ని నెలలుగా ఒక నిర్దిష్ట పరిధిలోనే కదులుతున్న బంగారం ధరలు, త్వరలోనే రాకెట్ వేగంతో దూసుకెళ్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జర్మనీకి చెందిన అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంక్ డాయిష్ బ్యాంక్ విడుదల చేసిన తాజా నివేదిక ఇప్పుడు ప్రపంచ మార్కెట్లలో ప్రకంపనలు సృష్టిస్తోంది. గత ఏడాది అక్టోబర్ నుండి ఈ ఏడాది జనవరి వరకు ప్రతిరోజూ కొత్త రికార్డులను సృష్టించిన బంగారం ధరలు, ఆ తర్వాత కొంత తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం చెన్నై మార్కెట్‌లో 8 గ్రాములు బంగారం ధర రూ.1.20 లక్షల లోపే ఉంది. అయితే ఇది కేవలం తుఫాను ముందు వచ్చే నిశబ్దం మాత్రమేనని డాయిష్ బ్యాంక్ అంచనా వేస్తోంది. వచ్చే ఐదేళ్లలో బంగారం ధర ఏకంగా 80 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆ బ్యాంక్ విశ్లేషించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర సుమారు 4,600 డాలర్లుగా ఉంటే, అది ఐదేళ్లలో 8,000 డాలర్లకు చేరుకుంటుందని ఈ నివేదిక సారాంశం. ఈ లెక్కన మన దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.15, 093 ఉండగా, అది భవిష్యత్తులో రూ. 25,000 వరకు వెళ్లవచ్చు. అంటే ఒక 8 గ్రాములు బంగారం ధర రూ. 2 లక్షల భారీ మైలురాయిని చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.

ధరలు ఎందుకు పెరుగుతాయి?

కేంద్ర బ్యాంకుల బంగారు వేట

ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు తమ విదేశీ మారక నిల్వల్లో బంగారం వాటాను భారీగా పెంచుకోనున్నాయి. ప్రస్తుతం ఉన్న 30శాతం నుండి 40శాతం వరకు నిల్వలను పెంచుకోవాలని బ్యాంకులు భావిస్తున్నాయి. దీనివల్ల మార్కెట్‌లో బంగారం కొనుగోళ్లు విపరీతంగా పెరిగి, ధరలకు రెక్కలు వస్తాయి.

డాలర్‌కు ప్రత్యామ్నాయంగా..

అమెరికా వంటి దేశాలు విధిస్తున్న ఆర్థిక ఆంక్షల నుండి రక్షణ పొందేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాయి. అమెరికా డాలర్ నిల్వలను 60శాతం నుండి 40శాతంకి తగ్గించుకుని, ఆ నిధులతో సురక్షితమైన బంగారాన్ని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నాయి.

కొత్త దేశాల మధ్య పోటీ

గతంలో కేవలం భారత్, చైనా, రష్యా, టర్కీలు మాత్రమే బంగారం కొనుగోళ్లలో ముందుండేవి. కానీ ఇప్పుడు కజకిస్తాన్, సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాలు కూడా భారీ ఎత్తున బంగారాన్ని నిల్వ చేయడం ప్రారంభించాయి. ఈ కొత్త దేశాల పోటీ కూడా ధరల పెరుగుదలకు ప్రధాన కారణం కానుంది.కాగా అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్థిక మార్పుల దృష్ట్యా, బంగారం వైపు ప్రపంచం మొత్తం చూపు సారిస్తోంది. ఐదేళ్లలో బంగారం ధర 80శాతం పెరుగుతుందన్న అంచనాలు నిజమైతే, సామాన్యులకు పసిడి ఆభరణాలు మరింత భారమయ్యే అవకాశం ఉంది. కానీ పెట్టుబడి కోణంలో చూసే వారికి మాత్రం ఇది ఒక గొప్ప అవకాశంగా మారనుంది.